సాక్షి
శ్రీకాకుళం

గురువారం। 12। సెప్టెంబర్। 2024



బైరిలో ఇసుక దుమారం

బైరిలో ఇసుక ర్యాంప్ ఏర్పాటుకు టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామస్తులు, రైతులు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. - 8లో



పీజీ సీట్లపై పేచీ!

ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. - 8లో

15న కొన్న చిన్నారావు అథ్లెటిక్స్ మీట్

శ్రీకాకుళం న్యూకాలనీ: కొన్న చిన్నారావు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఈ నెల 15న నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. పూర్తి వివరాలకు అథ్లెటిక్స్ సంఘ జిల్లా కార్యదర్శి, పీడీ మెంటాడ సాంబమూర్తి (85002 71575)ని సంప్రదించాలని నిర్వాహకుడు వాసు తెలిపారు.

న్యూస్‌రీల్

విపత్తుల వేళ బ్యాంకర్ల సహకారం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బ్యాంకర్ల సహకారం కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (ఈఈఈ), బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ఏర్పడిన నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శాఖల వారీగా నష్టాలపై ఆరా తీశారు. సమావేశంలో ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్, ఆర్ఎం హసీబ్, యూనియన్ బ్యాంక్ ఆర్‌హెచ్ వెంకట్ తిలక్, నాబార్డ్ డీడీఎం రమేష్‌కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాద్, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా బర్ల ప్రసాదరావు



శ్రీకాకుళం క్రైమ్ : అంతా అనుకున్నట్లే జరిగింది.. చార్జ్ తీసుకోకుండానే ఒకరు వెనక్కి వెళ్లగా.. మరొకరు అదే పోస్టింగ్‌లోకి వస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఇటీవల సంబంధిత శాఖ జనరల్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులందుకుని జిల్లాకు విచ్చేసిన వై.బి.పి.టి.ఎ.ప్రసాద్ కార్యాలయంలో రిపోర్ట్ ఇవ్వకుండానే వెనుదిరిగిన సంగతి విదితమే. నగరంలో రెండురోజులు బస చేసి మరీ ఈయన వెనక్కి వెళ్లడానికి ఓ ఫోన్ కాల్ రావడమే కారణమన్న చర్చ కూడా సాగింది. బుధవారం అదే శాఖ నుంచి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా బర్ల ప్రసాదరావును నియమిస్తూ మళ్లీ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పనిచేసిన అచ్చెన్న మంత్రాంగం..

తాను ఎంపిక చేసుకున్న శ్రీకాకుళం స్థానానికి ముందుగా వై.బి.పి.టి.ఎ.ప్రసాద్ విజిలెన్సు ఎస్పీగా గత గురువారం వచ్చారు. అయితే తన సన్నిహితుడైన బర్ల ప్రసాదరావు ఉద్యోగోన్నతి పొంది అదే విజిలెన్సు శాఖలో ఎస్పీగా మన జిల్లాకి రావడానికి ఉత్సుకత చూపడంతో జిల్లా మంత్రి అచ్చెన్న తన మంత్రాంగాన్ని నడిపారు. ఈ నెల 10 వరకు బర్ల ప్రసాదరావు నాన్‌క్యాడర్ ఎస్పీగా శిక్షణా కాలం ఉండటంతో అప్పటివరకు వేచి చూసి.. తర్వాత జిల్లాలోనే పోస్టింగ్ ఇప్పించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

శాస్త్రవేత్త సరోజ్‌కుమార్‌కు సన్మానం



సరోజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

పాతపట్నం: అయోధ్యలో కొలువుదీరిన రామ మందిరంలో బాల రాముడి విగ్రహంపై శ్రీరామనవమి నాడు సూర్య కిరణాలు తిలకంపై పడేలా తయారు చేసిన సాంకేతిక నైపుణ్యతలో నాయకత్వం వహించిన శాస్త్రవేత్త డాక్టర్ సరోజ్ కుమార్ పాణిగ్రహిని సీతారాంపల్లి గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని సీతారాంపల్లి గ్రామ వినాయక మండపం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాణిగ్రహి మాట్లాడుతూ అయోధ్య రామ మందిరంలో భాగస్వామ్యం అవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

ముంపు ప్రాంతం పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: తులసిగాం, రత్తకన్న, ఇన్నేశుపేట, ధర్మపురంలో ముంపునకు గురైన పంట పొలాలను బుధవారం ఆమదాలవలస కృషి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ హరికుమార్, డాక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు సీహెచ్.వెంకటరావుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక నీటిని తొలగించి పంట ఎదుగుదలకు 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌ను ఎకరా పొలంలో వేయాలని సూచించారు. సోంపేట వ్యవసాయ ఉప సంచాలకులు జగన్మోహనరావు, వ్యవసాయాధికారి టి.భార్గవి పాల్గొన్నారు.

3 కిలో మీటర్లు ముప్పుతిప్పలు

చిత్రం చెప్పిన కథ

ఆ రోడ్డులో ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. వర్షం పడిన తరువాత రెండు రోజులు పాటు మరింత నరకం చూస్తున్నారు. విపరీతమైన దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపెద్ద వాహనాలు తిరిగే క్రమంలో వాటి పక్కన లేదా వెనక్కి ప్రయాణిస్తే దుమ్ము ధూళితో పాటు చిన్నపాటి రాళ్లుకూడా గాల్లోకి ఎగిరి ముఖాన్ని తాకుతూ ఇబ్బందికరంగా మారుతున్నాయి. ముఖానికి ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా ప్రయాణిస్తే మాత్రం ముప్పుతిప్పలు తప్పడం లేదు. ఇంత చదివిన తరువాత ఆ రోడ్డు ఎక్కడనేది మీకూ అవగతమైంది కదూ.. అదేనండీ శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆమదాలవలస వెళ్లే మార్గంలోని ఫ్లైఓవర్ నుంచి ఉన్న కొత్తరోడ్డు.

– శ్రీకాకుళం రూరల్/టెక్కలి/ శ్రీకాకుళం కల్చరల్



రోజు వారీ ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య: సుమారు **5,000**

ఈ రోడ్డులో ఉన్న ముఖ్య ప్రాంతాలు..
- ఆమదాలవలస రైల్వే స్టేషన్
- జెమ్స్ ఆస్పత్రి
- రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం(నైరా)
- కృషి విజ్ఞాన కేంద్రం

ఈ రోడ్డులో ప్రయాణం తర్వాత కంటిని చల్లని నీటితో శుభ్రపర్చుకోవడం తప్పనిసరి. హెల్మెట్‌తో పాటు మాస్కు ధరించాలి.

ప్రయాణం సాహసమే..



ఉద్యోగ రీత్యా రోజూ ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వస్తుంటాను. కొత్త రోడ్డు మీదుగా ప్రయాణం మాత్రం రోజూ సాహసం అనే చెప్పాలి. దుమ్ము, ధూళి, అడ్డదిడ్డంగా ప్రయాణం సాగించే వాహనాలు.. బాబోయ్.. నరకం చూస్తున్నాం.

– సునీల్, వాహనచోదకుడు

షాపు తీయాలంటే నరకమే...



షాపు తీయాలంటే నరకం చూస్తున్నాం. వ్యాపారం సంగతి అటుంచితే..దుమ్ము, ధూళితో షాపు నిండిపోతోంది. మా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. వర్షం పడి ఆగిన తరువాత మరింత ధూళి పెరుగుతోంది.

– బి.రాజేష్‌కుమార్, వ్యాపారి, రాగోలు

శ్వాసకోశ వ్యాధుల ముప్పు..



ఇంత పెద్ద ఎత్తున దుమ్ము,ధూళి ఎగిరే రోడ్లపైనే సరైన రక్షణ చర్యలు తీసుకోకుండా ప్రయాణం చేస్తే ధూళి ఊపిరితిత్తులకు చేరి సిలికోసిస్ అనే శ్వాసకోశ వ్యాధి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దగ్గు, ఆయాసం, ఇతర అనారోగ్య సమస్యలు తప్పవు.

– డాక్టర్ కె.లక్ష్మణరావు, ఎండీ, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

కళ్లు జాగ్రత్త..



ఈ తరహా ధూళిలో ఉండే పెద్దపెద్ద రేణువులు కళ్లకు హాని చేస్తాయి. గుచ్చుకుంటే కంటికి ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. సరైన రక్షణ చర్యలు తీసుకోకుంటే కంటిపాపకు ప్రమాదమే.

– ఎం.సాయినిఖిత, కంటి వైద్య నిపుణురాలు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

మాదారపు వెన్నుపోటు ▸ గుండపై వేటు

సిక్కోలు టీడీపీలో వాట్సాప్ చిచ్చు
- టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తీరుపై విమర్శలు
- పార్టీ వాట్సాప్ గ్రూప్ నుంచి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, వారి అనుచరుల తొలగింపు
- కార్పొరేషన్ ఎన్నికలు, ప్రస్తుత నేతల మెప్పు కోసమేనని మండిపడుతున్న స్వపక్ష నేతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

శ్రీకాకుళం నగర టీడీపీలోని కొందరు నాయకులు ప్రస్తుత ప్రజాప్రతినిధుల మెప్పు కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఎమ్మెల్యే, మంత్రుల వీరభక్తులమని చెప్పుకునేందుకు తాపత్రయ పడుతున్నారు. అందులో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ముందున్నారు. తాను ఎక్కడ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అనుచరుడునని అనుకుంటారోనని వాట్సాప్ రాజకీయాలకు తెరలేపారు. నగర తెలుగుదేశం పార్టీ వాట్సాప్ గ్రూపు నుంచి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో పాటు ఆమె అనుచరులను తొలగించారు. ఇప్పుడిది నగర టీడీపీలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో పోటీ చేయనంత మాత్రాన, పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వనంత మాత్రాన ఏకంగా పార్టీ గ్రూప్ నుంచి సీనియర్ నాయకురాలిని తొలగించడమేంటని అదే పార్టీ నాయకులు తప్పు పడుతున్న పరిస్థితి నెలకొంది.

టికెట్ రాకపోయినా పార్టీలోనే 'గుండ'..

మొన్నటి ఎన్నికల్లో పోటీ చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత గుండ లక్ష్మీదేవి చివరి నిమిషం వరకు భావించారు. అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందని ఆఖరి వరకు బరిలో ఉన్నారు. కానీ, కింజరాపు ఫ్యామిలీ రాజకీయాలకు ఆమె బలి అయిపోయారు. జిల్లా కేంద్రంలో చక్రం తిప్పడం కోసం, భవిష్యత్‌లో తమ ఫ్యామిలీకి చెందిన వారే ఇక్కడ పాగా వేయాలన్న దూరదృష్టితో 2024 ఎన్నికల రాజకీయ పోరులో గుండ ఫ్యామిలీని ఎలిమినేట్ చేశారు. ఎన్నికల్లో ఆ పార్టీ గెలవడంతో తమ వ్యూహం ఫలించిందని అధిష్టానం వద్ద మార్కులు కొట్టే ప్రయత్నం జరిగింది. అయితే, టిక్కెట్ రాలేదన్న అసంతృప్తి గుండ ఫ్యామిలీలో ఉన్నప్పటికీ టీడీపీని వదిలి ఏ పార్టీలోనూ చేరలేదు.



నగర టీడీపీ వాట్సాప్ గ్రూప్ నుంచి గుండ లక్ష్మీదేవితో పాటు మరికొంతమందిని రిమూవ్ చేసిన స్క్రీన్ షాట్ చిత్రం

మరో పార్టీలోకి వెళ్లాలన్న ఆసక్తి లేకపోవడంతో సైలెంట్‌గా ఉండిపోయారు. పార్టీ అధిష్టానం కూడా గుండ ఫ్యామిలీ తీరును ఎక్కడా తప్పు పట్టలేదు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని క్రమశిక్షణా చర్యలు తీసుకోలేదు. మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ కూడా టీడీపీకి అనుకూలంగానే మాట్లాడుతూ వస్తున్నారు. దీంతో ఆ ఫ్యామిలీ టీడీపీలోనే ఉందన్నది సుస్పష్టం.

మాదారపు తీరుపై చర్చ..

ఈ సమయంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అనుసరించిన తీరు టీడీపీలో కలకలం రేపింది. పార్టీని అనేక ఏళ్లు నడిపిన, కష్టకాలంలో బాధ్యతలను భుజాన వేసుకున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని అవమానపరిచేలా వాట్సాప్ గ్రూప్ నుంచి ఆమెతో పాటు వారి అనుచరులను రిమూవ్ చేయడం అవమానకరమే అని చెప్పాలి. పోనీ, ఇదెవరో చేశారనుకుంటే ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదు. ఎన్నికలకు ముందు లక్ష్మీదేవికి టికెట్ కోసం వెంకటేషే రాద్ధాంతం చేశారు. కింజరాపు కుటుంబీకులపై విరుచుకుపడ్డారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ప్రస్తుత ఎమ్మెల్యే శంకర్‌తో రెల్లివీధి వద్ద ఢీ అంటే ఢీ అన్నారు. ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ విమర్శలు మూటగట్టుకున్నారు.



మెప్పు కోసమేనా..

గుండ లక్ష్మీదేవి ప్రధాన అనుచరుడిగా ఒకప్పుడు ముద్ర వేసుకున్న మాదారపు వెంకటేష్ ప్రస్తుత పార్టీ పెద్దల మెప్పు కోసమే ఇదంతా చేశారన్న వాదనలు ఉన్నాయి. తాను గుండ ఫ్యామికి వీర విధేయుడిని కాదని, ప్రస్తుత పెద్దల మనిషినేని చెప్పుకునేందుకు పడ్డ తాపత్రాయంగా శ్రేణులు భావిస్తున్నాయి. వెంకటేష్ నగర కార్పొరేషన్‌పై ఆశలు పెట్టుకున్నారు. తాను అనుకున్నట్టుగా అంతా జరిగి ఉంటే తానే మేయర్ అభ్యర్థిని అవుతానని భావించారు. అయితే, మొన్నటి ఎన్నికల్లో గుండ లక్ష్మీదేవికి టికెట్ రాకపోవడంతో ఆయన అంచనాలు తలకిందులయ్యాయి. శంకర్‌ను తొలుత వ్యతిరేకించినా ఆ తర్వాత ఆయన పంచన చేరారు. కానీ, శంకర్ మాత్రం తానొక టీమ్‌ను అప్పటికే నడుపుతున్నారు. గుండతో కలిసి ఉన్న నాయకుల్ని పక్కన పెట్టాలన్న అభిప్రాయానికొచ్చారు. ఇదే సమయంలో కార్పొరేషన్‌పై కన్నేసిన అంధవరపు వరం ఫ్యామిలీ టీడీపీ తీర్థం పుచ్చుకుంది. దీంతో కార్పొరేషన్‌కు సంబంధించి టీడీపీలో పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే వెంకటేష్ సచ్ఛీలతను నిరూపించుకునే ప్రయత్నానికి దిగినట్టు తెలుస్తోంది.

గుర్తింపేనట.. నిధులు లేవట!




కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారు

- కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతరకు రాష్ట్ర పండుగగా మాత్రమే గుర్తింపు
- నిధులు కేటాయింపునకు అంగీకరించని సర్కారు
- కోటి రూపాయల నిధులు ఒట్టి హడావిడే
- టీడీపీ నేతల తీరుపై విమర్శలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర ఘనంగా జరుపుకొందాం.. రాష్ట్ర పండుగగా నిర్వహిద్దాం.. ప్రభుత్వం నుంచి గుర్తింపు తెస్తాం.. జాతర కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయిస్తాం..' ఇదీ ఎన్నికల ముందు ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన ప్రకటన. ఆ హామీని నెరవేర్చారని టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున హడావుడి చేస్తున్నారు. కొత్తమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయమే. కానీ, రాష్ట్ర పండుగగా గుర్తించి, జారీ చేసిన జీవోలో ప్రస్తావించిన అంశాలు ఆశ్చర్యం కల్గిస్తున్నాయి. ఒక్క పైసా కేటాయించకుండా జీవో విడుదల చేసి, సింగిల్ అజెండా ప్రకటనలా ప్రభుత్వం చేతులు దులుపుకొంది. కలెక్టర్ ఆధ్వర్యంలో శాఖల సమన్వయంతో పండుగ ఘనంగా జరిగేలా జీవోలో పేర్కొంది. వాస్తవంగా కొత్తమ్మతల్లి జాతర ప్రతీ సంవత్సరం భారీ ఏర్పాట్లు, బందోబస్తు మధ్యే జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఇప్పుడిచ్చే రాష్ట్ర పండుగ జీవోలో అవే అంశాలున్నాయే తప్ప ప్రత్యేకించి ఏమీ లేవు. సాధారణంగా రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి, మరింత ఘనంగా జరుపుకొనేందుకు సహాయ పడాలి. తాజాగా ఇచ్చిన జీవోలో మాత్రం ఎటువంటి ఆర్థిక సాయం లేకుండా రాష్ట్ర పండుగగా జరుపుకొనేందుకు గుర్తింపునిస్తున్నట్టు స్పష్టం చేసింది. చెప్పాలంటే రాష్ట్ర పండుగకైతే ఓకే.. నిధులు మాత్రం ఇవ్వలేమన్నట్టుగా జీవో ద్వారా తెలియజేసింది.



జారీ చేసిన జీవో

అరసవిల్లి ఆదిత్యాలయానికి పట్టువస్త్రాల బాధ్యత

జాతర సందర్భంగా కొత్తమ్మతల్లికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను జిల్లా మంత్రి సమర్పించనున్నారు. దీనికోసం ఒక్క రూపాయి విడుదల చేయలేదు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం నిధుల నుంచి తీసి పట్టు వస్త్రాల కోసం ఖర్చు చేయాలని స్పష్టం చేసింది. దీన్నిబట్టి రాష్ట్ర పండుగగా గుర్తించి జీవో ఇవ్వడం తప్ప కొత్తమ్మతల్లి జాతరకు కొత్తగా ఇచ్చిందేమి లేదు. ఈ జీవోను క్షుణ్ణంగా పరిశీలించకుండా అమ్మవారి జాతరకు కోటి రూపాయల నిధులు మంజూరు చేసినట్టు అధికార వర్గాలు లీకులిచ్చి పెద్ద ఎత్తున ప్రచారం చేయడం విమర్శలకు దారితీసింది. బుధవారం ఉదయం నుంచి రాష్ట్ర పండుగ గుర్తింపు...కోటి రూపాయల నిధులు మంజూరుపై టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం చేసినప్పటికీ.. జీవోలో ఉన్న అంశాలను ప్రస్తావిస్తూ కొంటర్లు పడటంతో ఒక్కసారిగా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.

● ఆరగించవయ్యా!


పలాస ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం రాత్రి మహాప్రసాద నివేదన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు సిద్ధం చేసిన 501 రకాల ప్రసాదాలను స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. - కాశీబుగ్గ



వెళ్లి రావయ్యా!

వినాయక నిమజ్జనోత్సవాలు ఆనందోత్సాహాల నడుమ సాగుతున్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం నగరంలోని కోటేశ్వరాలయం వద్ద నాగావళి నది ఒడ్డున బుధవారం సాయంత్రం పెద్ద ఎత్తున గణనాథుల ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. - శ్రీకాకుళం కల్చరల్





రెండు గంటలు ట్రాఫిక్ జామ్

బూర్జ: కొల్లివలస జంక్షన్‌లో బుధవారం భారీ బొగ్గు లారీ కూరుకుపోయింది. పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారి కావడంతో 2 గంటల పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. మదనాపురం జంక్షన్ నుంచి సరుబుజ్జిలి జంక్షన్ మీదుగా శ్రీకాకుళం వెళ్లాల్సిన బస్సులు రూట్ మళ్లించడంతో ప్రయాణికులకు కాస్త ఊరట కలిగింది. మట్టిలో కూరుకుపోయిన లారీని స్థానిక పోలీసులు రెండు జేసీబీలు పెట్టి బయటకు తీశారు.

క్లుప్తంగా

భారీ కొండచిలువ మృత్యువాత



మృతిచెందిన కొండచిలువ

నందిగాం/కాశీబుగ్గ: నందిగాం మండలం కొత్త అగ్రహారం సమీపంలో లారీ కిందపడి పది అడుగుల కొండచిలువ మృత్యువాతపడింది. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు లక్ష్మీపురం టోల్‌గేటు హైవే సిబ్బంది తెలిపారు.

దివ్యాంగుల నార్త్‌జోన్ క్రికెట్ టోర్నీకి నలుగురు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జునరెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా నుంచి దివ్యాంగుల నార్త్‌జోన్ టోర్నీకి రికార్డుస్థాయిలో నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో ఎం.లక్ష్మణ్, ఎం.వెంకటరమణ, బి.రామకృష్ణ, కె.ప్రసాద్ ఉన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులలో శర్మ కాలేజ్ మైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న పరిమిత ఓవర్ల అంతర్‌జోనల్ దివ్యాంగుల క్రికెట్ పోటీలలో పాల్గొనే నార్త్‌జోన్ క్రికెట్ జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి బుధవారం తన నివాసంలో అభినందించారు. పోటీలకు వెళ్లివచ్చేందుకు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


బ్రిటన్‌లో ప్రదర్శనకు సంప్రదాయం విద్యార్థులు



సంప్రదాయం గురుకులం విద్యార్థులతో డైరెక్టర్ స్వాతి సోమనాథ్

శ్రీకాకుళం కల్చరల్: సంప్రదాయం కూచిపూడి గురుకులం(కల్లేపల్లి), పైడా ఇంటర్నేషనల్, యూకే సంయుక్త నిర్వహణలో బ్రిటన్‌లో కూచిపూడి శిక్షణా తరగతులు, నృత్య నాటికలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సంప్రదాయం డైరెక్టర్ స్వాతీసోమనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి అక్టోబరు 14 వరకు పలు చోట్ల ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎన్‌ఆర్ఐ పిల్లలకు, బ్రిటీషర్లకు కూచిపూడిలో మెలకువలు నేర్పిస్తామని చెప్పారు. దసరా కేంబ్రిడ్జి యూనివర్సిటీ, ఇండియన్ ఎంబసీ వద్ద 'కామసూత్ర' నృత్య రూపకం ప్రదర్శిస్తామని తెలిపారు. తనతో పాటు సంప్రదాయం విద్యార్థులు కె.బలరాం, యామిని కసిరెడ్డి, అంజలి కూడా పర్యటనలో పాల్గొంటున్నారని వివరించారు.

ఎచ్చెర్ల ఐటీఐలో అప్రెంటిస్ మేళా



మాట్లాడుతున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళాను ఎచ్చెర్ల ఐటీఐలో బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 177 మంది విద్యార్థులు హాజరు కాగా 45 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ వి.మూర్తి, డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్మోహన్, ట్రైనీ అధికారి పి.విద్యాసాగర్, ఎస్‌పీసీఎల్, మహాదన్ అగ్రిటెక్ హెచ్‌ఆర్‌లు వంశీ, వై.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పీజీ సీట్లపై పేచీ!



పొన్నాడ పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలను ధరించి విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

- ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ జీఓ 85 జారీ చేసిన రాష్ట్ర సర్కారు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు

అరసవల్లి:

ప్రభుత్వ వైద్యరంగంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఇప్పటికే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్న సర్కారు.. తాజాగా ప్రభుత్వ వైద్యులకు కోటాపై రానున్న పీజీ సీట్లపై కూడా పేచీ మొదలుపెట్టింది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇన్‌సర్వీస్ కోటా సీట్లలో కోత విధిస్తూ సగానికి సగంగా రిజర్వేషన్‌ను నిర్ధారిస్తూ..తక్షణమే అమల్లోకి వచ్చేలా జీఓ 85ని విడుదల చేసింది. దీంతో గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు భగ్గుమంటున్నారు. గత ప్రభుత్వంలో సర్వీస్ కోటాకు అర్హత గల వైద్యులకు.. క్లినికల్ సీట్లకు 30 శాతం, నాన్ క్లినికల్ సీట్లకు 50 శాతం వరకు రిజర్వేషన్ కోటాగా పి.జి. సీట్లను కేటాయించగా..ఇప్పుడు కోటాను సగానికి తగ్గించేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రెండు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. సమ్మెకు సైతం సిద్ధమంటూ నోటీసులిచ్చేందుకు ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణకు రంగం సిద్ధం చేస్తున్నారు.

జీఓ 85 ఏం చెబుతోందంటే...!

నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ పూర్తిచేసిన ప్రభుత్వ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో కనీసంగా 3 ఏళ్ల పనిచేసినా లేదా ఏజెన్సీ ప్రాంతాల్లో కనీసం రెండేళ్లుగా రెగ్యులర్ సేవలందించినా.. ఇన్‌సర్వీస్ కోటాకు అర్హులుగా గుర్తిస్తారు. వీరికి పీజీ విద్యలో ప్రవేశానికి గాను ప్రభుత్వం ప్రత్యేకంగా ఇన్‌సర్వీస్ కోటాను ప్రవేశపెట్టి క్లినికల్ సీట్లకు 30 శాతం, నాన్ క్లినికల్ సీట్లకు 50 శాతం వరకు రిజర్వేషన్ కల్పించారు. ఇదే విధానం గత ప్రభుత్వంలో కచ్చితంగా అమలు చేసి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ప్రతి పీహెచ్‌సీకి రెండేసి వైద్యుల పోస్టులుండేలా నియామకాలు కూడా భారీ ఎత్తున చేపట్టారు.

జీఓ 85 రద్దు చేయాల్సిందే

ఇది ముమ్మాటికీ చీకటి జీవోనే. గతంలో ఉన్న పీజీ సీట్ల కోటా శాతాన్ని పూర్తిగా తగ్గించేయడం దారుణం. కొత్త నిబంధనల ప్రకారం ఇస్తున్న కోటాలో కూడా క్లినికల్ పీజీ సీట్లలో కేవలం ఆరు విభాగాలకే పరిమితం చేయడం అన్యాయం. ప్రభుత్వం పునరాలోచించి జీఓ 85ని రద్దు చేసే వరకు నిరసన కొనసాగిస్తాం. త్వరలో సమ్మె నోటీసు జిల్లా స్థాయి అధికారులకు అందజేసేందుకు నిర్ణయించాం.

–డాక్టర్ ఎస్.శేషగిరి, పొన్నాడ పీహెచ్‌సీ

సీట్లకు కోత..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ కోటాలో సగానికి కత్తెర వేసి క్లినికల్ సీట్లకు కేవలం 15 శాతం, నాన్ క్లినికల్ సీట్లకు 30 శాతం మాత్రమే పీజీ సీట్లలో రిజర్వేషన్ వర్తించేలా గత నెల జీఓ 85 విడుదల చేశారు. జీఓ అమలైతే చాలా మంది అర్హులకు అన్యాయం జరుగుతుంది. వాస్తవానికి పీజీ పూర్తి చేసిన ప్రభుత్వ వైద్యులకు వివిధ స్థాయి ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్యులుగా నియమించుకునే వెసులుబాటు ఉండేది. కానీ కోటాను తగ్గించడంతో ఇటు ఉన్నత చదువులతో పాటు మెరుగైన వైద్యం అందించే అవకాశాలు ప్రభుత్వ రంగం పరంగా కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురుకానుంది.

కొనసాగుతున్న నిరసన..

జిల్లాలో రూరల్ పీహెచ్‌సీలు 71, అర్బన్ పీహెచ్‌సీలు 13 వరకు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీల వైద్యులకు ఇబ్బందిగా మారిన జీఓ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. సుమారు 158 మంది వైద్యులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ నెల 10 నుంచి 12 వరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలని నిర్ణయించారు. నేడో రేపో సమ్మె నోటీసు కూడా ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇదే జరిగితే ఇటు గ్రామీణ ప్రాంతాలు.. అటు ఏజెన్సీ ప్రాంతాల్లో సామాన్యులకు అందే వైద్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. ఇప్పటికైనా కూటమి సర్కారు వైద్య రంగం, వైద్యులపై కక్ష సాధింపు ధోరణిలు వీడాలని, జీఓ 85 రద్దు చేయాలని వైద్యులు కోరుతున్నారు.

సీపీఎస్ రద్దుకు వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉపాధ్యాయ శాసన మండల ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, తమ ప్రాతినిధ్యాన్ని బలపరిచే అవకాశాన్ని కల్పించాలని, పీఆర్‌సీకి చైర్మన్ నియమించాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని, జీఓ 117 రద్దు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సీర రమేష్‌బాబు, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

మావుడూరికి స్మారక పురస్కారం ప్రదానం నేడు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసుడు మావుడూరు సూర్యప్రసాదరావుకు గురువారం తరిణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మండ కృష్ణ రామ్‌ప్రసాద్ స్మారక మృదంగ పురస్కారం' ప్రదానం చేస్తామని మేనేజింగ్ ట్రస్టీ మండ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాయంత్రం 5.30 గంటలకు జరిగే కార్యక్రమంలో అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

రాణించిన జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-23 పురుషుల క్రికెట్ జట్టు సమష్టిగా రాణించింది. విజయనగరంలోని విజ్జీ క్రికెట్ మైదానం వేదికగా జరుగుతున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-23 పురుషుల త్రీడేస్ క్రికెట్ టోర్నీలో విజయనగరంతో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యతను సంపాదించి మ్యాచ్‌ను కాపాడుకుని డ్రా చేసుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం జట్టు 98.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 398 పరుగులు చేసింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 88.3 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 401 పరుగులు చేసింది. శ్రీకాకుళం జట్టు బ్యాటింగ్‌లో ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్ 5ఫోర్లు, 4 సిక్సర్లతో 92 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా కెప్టెన్, ఓపెనర్ నంబళ్ల సుశాంత్ 64 పరుగులు సాధించాడు. బౌలింగ్‌లో డీవీఎస్ శ్రీరాం 4 వికెట్లు, ఎం.పూర్ణచంద్ర, సాయియశ్వంత్, హర్షిత్ తలా వికెట్ సాధించారు. జిల్లా జట్టు రాణింపు పట్ల జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

దాడికి పాల్పడిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: పూండి గోవిందపురంలో 2019లో ఓ కుటుంబంపై దాడికి పాల్పడిన కేసులో అదే గ్రామానికి చెందిన అనకాపల్లి ఏర్నిబాబుకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.11 వేల జరిమానా విధించారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఎస్.ఎం.ఫణికుమార్ బుధవారం తీర్పునిచ్చారు.

రేపటి నుంచే స్కూల్‌గేమ్స్

- తొలి రోజు ఐదు అంశాల్లో పోటీల నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎస్‌జీఎఫ్ అధికారులు



ఖోఖో సాధనలో బాలికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల క్రీడల (స్కూల్‌గేమ్స్)కు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి జరగనున్న స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, పీఈటీ సంఘ నాయకులు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు.

అర్హులు ఎవరంటే?

అండర్-14, 17, 19 వయో విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు జరుగుతాయి. పాఠశాల విద్య పరిధిలో అండర్ 14, 17 విభాగాల్లో, ఇంటర్మీడియెట్ విద్య పరిధిలో అండర్-19 ఎంపికలు జరుగుతాయి. అండర్-14 పోటీలకు 2011 జనవరి ఒకటి, అండర్-17కు 2008 జనవరి ఒకటి, అండర్-19 పోటీలకు 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి. అండర్-14కు 8వ తరగతిలోపు, అండర్-17కు ఇంటర్ ఫస్టియర్‌లోపు, అండర్-19కు డిగ్రీ ఫస్టియర్‌లోపు చదువుతుండాలి.

32 క్రీడాంశాలతో..

మొత్తం 32 క్రీడాంశాల్లో జరగనున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, జూడో, సెపక్‌తక్రా, హాకీ, తైక్వాండో, టెన్నిస్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, చెస్, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్, త్రోబాల్, నెట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, రగ్బీ, వెయిట్‌లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టెన్నికాయిట్, యోగా, ఆర్చరీ, బాక్సింగ్, స్విమ్మింగ్, రోలర్‌స్కేటింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయి. ఇక్కడ ఎంపికైన వారు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

తొలిరోజు ఐదు క్రీడాంశాల్లో..

ఈ నెల 13న బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, ఫుట్‌బాల్, రెజ్లింగ్, టేబుల్‌టెన్నిస్ క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయి. బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా ఎంపికలు శ్రీకాకుళం ఎన్టీఆర్‌ఎంహెచ్ స్కూల్ మైదానంలో, ఫుట్‌బాల్ ఎంపికలు శ్రీకాకుళం కేఆర్ స్టేడియంలో, రెజ్లింగ్ ఎంపికలు పెద్దపాడులో, టేబుల్‌టెన్నిస్ ఎంపికలు శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా రేపు ఉదయం 9 గంటల నుంచి మొదలుకానున్నాయి.

పకడ్బందీగా ఏర్పాట్లు..



జిల్లాలో స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈఓ నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, ఎంఎస్‌వోలు, నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ల సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– బడి వెంకటరమణ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి

పారదర్శకంగా పోటీలు..



విద్యార్థి జీవితంలో కీలకమైన స్కూల్‌గేమ్స్ పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని వసతులు, భోజనాలు కల్పించేలా ఎంఈవోలు, హెచ్‌ఎంలు, పీడీలు పూర్తి చొరవ తీసుకోవాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు

వంశధార తగ్గుముఖం



గొట్టా బ్యారేజీ వద్ద దిగువకు విడిచిపెడుతున్న నీటి ప్రవాహం

హిరమండలం: వంశధార గొట్టాబ్యారేజీ వద్ద నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం బ్యారేజీలో 37.37 మీటర్ల నీటిమట్టం ఉంది. బుధవారం ఉదయానికి 17200 క్యూసెక్కులు, మధ్యాహ్నానికి 15878 క్యూసెక్కులు, సాయంత్రానికి 14250 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గుతూ వచ్చింది. 10 గేట్లు పైకి ఎత్తి దిగువకు 13319 క్యూసెక్కులు విడిచిపెట్టారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 104 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 341 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నట్లు డీఈ ఎం.రంగనాయకులు తెలిపారు.

రోగికి వైద్యుడి రక్తదానం



రక్తదానం చేస్తున్న డాక్టర్ నంబాళ్ల శ్రీనివాసరావు

కాశీబుగ్గ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు వైద్యసేవలు అందించడమే కాదు అవసరమైనప్పుడు రక్తదానం చేసి ప్రాణాలు సైతం నిలుపుతామని నిరూపించారు డాక్టర్ నంబాళ్ల శ్రీనివాసరావు. వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు గ్రామానికి చెందిన తామాడ నారాయణమ్మ పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బుధవారం 'ఏ నెగిటివ్' గ్రూపు రక్తం అత్యవసరం కావడంతో ఆ నలుగురు ట్రస్ట్ చైర్మన్ పిచ్చిక పాపారావు ఇచ్చిన సమాచారం మేరకు పలాసలోని డాక్టర్ వైఎస్ఆర్ కిడ్నీ పరిశోధన కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ నంబాళ్ల శ్రీనివాసరావు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును కిడ్నీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర కూన మోహనబాబు అభినందనలు తెలిపారు.

కారు ఢీకొని విశ్రాంత ప్రిన్సిపాల్ మృతి



పూజారి శ్రీరాములు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కింతలి మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేశవరావుపేటకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ పూజారి శ్రీరాములు(77) మృతి చెందారు. రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం వైపు వెళుతున్న కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆయన ఘటనా స్థలంలోనే తుది శ్వాస విడిచారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీరాములుకు భార్య, కుమారుడు ఉన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకునిగా విధులు నిర్వర్తించిన శ్రీరాములు స్వగ్రామం కేశవరావుపేట. శ్రీకాకుళం పట్టణంలో నివాసముంటూ అప్పుడప్పుడూ గ్రామానికి వస్తుండేవారు.

ఖేలో ఇండియా తైక్వాండో పోటీలకు పయనం



పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో కోచ్‌లు, నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి ఖేలో ఇండియా తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలవాలని ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను పిలుపునిచ్చారు. తమిళనాడులోని దిండిగల్ వేదికగా జరుగుతున్న రెండవ అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్ -2024 (ఖేలో ఇండియా) జాతీయ స్థాయి పోటీలకు జూనియర్ డివిజన్‌లో బండి శిరీష, ఆర్.హాసిని, జి.దుర్గా భవానీ, శిమ్మ నవ్య, సీనియర్ డివిజన్‌లో వైశ్యరాజు జాస్మిన్, సీహెచ్ సంధ్యారాణి, ఎల్.జగదీశ్వరి ఎంపికయ్యారు. వీరు మంగళవారం రాత్రి పయనమై వెళ్లగా వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్ వర్మలు వీడ్కోలు పలికారు. మజ్జి గౌతమ్, మోర్తా సాయి బాలాజీలు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బంగ్లాదేశ్ యువకుడు మృతి

కాశీబుగ్గ: కొర్రాయి గేటు సమీపంలో రోడ్డు ప్రమాదంలో బంగ్లాదేశ్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన మహమ్మద్ ముస్తాక్ టోనీ, మహమ్మద్ హసీబ్ అలాం, ఆసిఫ్ మహమ్మద్ సరో అనే ముగ్గురు యువకులు భువనేశ్వర్ కేఐఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు.

వీరి స్నేహితుడైన మరో యువకుడు మహమ్మద్ తన్వీర్ రెహమాన్ టూరిస్ట్ వీసాపై భారత పర్యటనకు సెప్టెంబర్ 7న వచ్చాడు. నలుగురూ కలిసి ఈ నెల 9న రాత్రి రెండు బైకులపై విశాఖపట్నం – చెన్నై పర్యటనకు బయలుదేరారు. కొర్రాయిగేట్ సమీపంలో జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మహమ్మద్ ముస్తాక్ టోనీకి బలమైన గాయం కావడంతో హరిపురం సీహెచ్‌సీ తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం టెక్కలి, శ్రీకాకుళం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తన్వీర్ రెహమాన్ ఫిర్యాదు మేరకు మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఉధృతంగా కడపలవాని గెడ్డ



గెడ్డలో దిగి రాకపోకలు సాగిస్తున్న దబ్బపాడు గ్రామస్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట–దబ్బపాడు గ్రామాల మధ్య కడపలవాని గెడ్డలో వరద నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. వర్షాలు తగ్గి మూడు రోజులు కావస్తున్నా సుమారు నాలుగు అడుగుల మేర నీటి ప్రవాహం ఉండటంతో దబ్బపాడు, తురపేట, వాడవలస తదితర గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నామని దబ్బపాడు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గెడ్డపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

పొలం వివాదంలో ఇద్దరికి జైలు శిక్ష

నరసన్నపేట: స్థానిక పురుషోత్తంనగర్ వద్ద పొలం వివాదంపై నమోదైన కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ బుధవారం తీర్పునిచ్చారు. 2018లో పురుషోత్తంనగర్‌కు చెందిన పిరియా సుజాత నలుగురిపై ఫిర్యాదు చేశారు. ఇందులో ఎస్.త్రినాథరావు, శ్రీనివాసరావులను దోషులుగా నిర్ణయించారు. త్రినాథరావుకు 18 నెలలు జైలు శిక్ష, రూ. 2 వేలు జరినామా, శ్రీనివాసరావుకు ఆరునెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరినామా విధించారు. మిగిలిన ఇద్దరు లక్ష్మీనారాయణ, సంపతిరావు మన్మధరావులను నిర్దోషులుగా గుర్తించి వారిపై కేసు కొట్టి వేశారు. ఈ కేసులో ఏపీపీగా శాంతి సంతోషికుమారి వ్యవహరించారు.

బైరిలో ఇసుక దుమారం

- ఇసుక ర్యాంప్ ఏర్పాటుకు టీడీపీ నేతల ప్రయత్నాలు
- సబ్ లీజుకు సైతం ఒప్పందాలు!
- అనుమతుల కోసం స్థానిక ఎమ్మెల్యే కసరత్తు
- ర్యాంప్‌ను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు, రైతులు
- వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారంటూ మండిపాటు



బైరిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి–శ్రీకాకుళం: సిరులు కురిపిస్తున్న ఇసుకపై పట్టు సాధించేందుకు తెలుగుదేశం నాయకులు ఎంతకైనా వెనుకాడటం లేదు. నిబంధనలు అనుకూలించకపోయినా, ప్రకృతికి నష్టం వాటిల్లే ప్రమాదమున్నా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే శ్రీకాకుళం రూరల్ మండలం బైరి గ్రామంలో ఇసుక ర్యాంపును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో ఎలాగైనా ర్యాంప్‌ను దక్కించుకునేందుకు స్థానిక టీడీపీ నేతలు విశ్వప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే ర్యాంప్‌కు అనుమతులు ఇవ్వాలంటూ ఆయా శాఖల అధికారులతో స్థానిక ఎమ్మెల్యే తెరవెనుక మంతనాలు చేయడం ప్రారంభించినట్లు సమాచారం. అనుమతులు వచ్చిన వెంటనే రూ.4కోట్లు సబ్‌లీజుకు ఇచ్చేందుకు కూడా గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు లోపాయికారంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. మరోవైపు, బుధవారం బైరి గ్రామంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ శ్రీకాకుళం ఆర్డీవో రంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. తమ గ్రామంలో ర్యాంపు ఏర్పాటు చేయవద్దంటూ పలువురు రైతులు, గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

వాల్టా చట్టానికి తూట్లు..

వంశధార నదీ పరివాహక ప్రాంతానికి కూతవేటు దూరంలోనే బైరి గ్రామం ఉంది. వంశధార నది సర్వే నంబర్ 208లో ఉంది. ఇక్కడ ఇసుక నిల్వలు కూడా పూర్తిస్థాయిలో లేవు. వాస్తవానికి ర్యాంపు ఏర్పాటు చేయాలంటే ఇసుక 4 మీటర్ల ఎత్తున నిల్వ ఉండాలి. ఇక్కడ మాత్రం మీటరు కూడా ఇసుక నిల్వ కనిపించడం లేదు. ఇసుక తవ్వకాల నుంచి సుమారు అర కిలోమీటరు దూరంలో గ్రామం ఉండాలి. కానీ బైరి గ్రామం ఎస్సీ వీధిని కలుపుకొంటే వంశధార నదికు దగ్గరిలోనే కనిపిస్తోంది. గ్రామం చుట్టూ 16 సాగునీరు, తాగునీరు బోర్లు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ర్యాంపునకు అనుమతులు భూగర్భ జలాలు అడుగంటి పోతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బైరిలో ఇసుక తవ్వకాలు జరిగితే నదికు ఆనుకొని ఉన్న శివాలయానికి ముప్పు వాటిల్లే ప్రమాదముంది. ఎస్సీ వీధికి సైతం ముంపునకు గురయ్యే అవకాశముంది.

కోర్టును ఆశ్రయిస్తాం..



మా గ్రామానికి ర్యాంపు ఇస్తే ప్రమాదమే. అనుమతులు రద్దు చేయాలంటూ ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం అందించాం. మైన్స్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులను సైతం కలిసి వినతిపత్రాలిచ్చాం. కేంద్ర పర్యావరణ శాఖకు కూడా ఫిర్యాదు చేస్తాం. అవసరమైతే అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

– బైరి ఢిల్లీరావు, గ్రామస్తుడు

స్థల పరిశీలన చేయకుండానే..

ఇసుక ర్యాంపు మంజూరు చేయాలంటే ముందుగా స్థల పరిశీలన చేయాలి. బైరిలో మాత్రం ఇంతవరకూ స్థల పరిశీలన చేయకుండానే టీడీపీ నాయకుల మాటలతోనే ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకొంది.

బైరి పంచాయతీ పరిధిలో సుమారు 2,500 మంది జనాభా ఉన్నా కేవలం 30 మందితోనే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది..

సాక్షి

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టి కుటుంబ సభ్యులందరికీ కావలసిన విమూత్న సమాచారంతో అలరిస్తున్న సాక్షికి శ్రీకాకుళం జిల్లా, ఒడిశాలో క్రింది ప్రాంతాలకు న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

పరీక్షా తేది: 16-09-2024 సోమవారం ఉ॥ 11 గంటలకు

కేంద్రాలు

1) పొందూరు రూరల్ 2) ఆమదాలవలస రూరల్ 3) మందస 4) ఇచ్ఛాపురం టౌన్ 5) నరసన్నపేట రూరల్ 6) బరంపురం (ఒడిశా)

16-09-2024 సోమవారం ఉదయం 11 గంటలకు జరిగే రాత పరీక్షకు నేరుగా హాజరు కావలెను.

సాక్షి కార్యాలయం, వీనస్ ఆప్టికల్స్ మేడపైన, డే అండ్ నైట్ జంక్షన్ దగ్గర, పాలకొండరోడ్, శ్రీకాకుళం

సాక్షి తెలుగు దినపత్రిక

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640528899, 9640648899 [H-796196]

■ కష్టలేన్సీ కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. 9182260297. [HA-98406]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.